

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌కు

# స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్ కు చేరుకున్న భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌కు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపత్ రావు పాటిల్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్

ఏసీబీ వలలో

# వ్యవసాయ అధికారి

**వనపర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** వనపర్తి కలెక్టరేట్ లోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడులు నిర్వహించారు. రూ. 10 వేల లంచం తీసుకుంటూ జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. యురియా సరఫరా నిమిత్తం ఒక ఫర్టిలైజర్ దుకాణం వ్యాపారి దగ్గర నుంచి రూ.20 వేలు డిమాండ్ చేయగా రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.



అంజనేయులు గౌడ్

# భార్యపై భర్త దాడి..

**భార్య మృతి .. అనాథలైన పిల్లలు**



జమ్ములమ్మ ( ఫైల్ )

**గద్వాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** కట్టుకున్న భార్యను కొట్టి చంపిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్లితే నెట్టెంపాడు గ్రామానికి చెందిన కురువ గోవిందుకు అదే గ్రామానికి చెందిన జమ్ములమ్మతో రెండో వివాహం జరిగింది . వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం రాత్రి భార్య,భర్తల మధ్య చిన్న గొడవ కారణంగా భర్త భార్యపై కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. అడ్డుకోబోయిన కుమారుడికి గాయాలయ్యాయి. గతంలో తన తల్లిదండ్రులపైనే హత్యాయత్నానికి పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడనీ తెలిపారు. గోవిందు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కొంతకాలం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రిలో చికిత్స కూడా పొందాడనీ, గోవిందు మొదటి భార్య గతంలోనే మృతి చెందగా, జమ్ములమ్మతో రెండో వివాహం జరిగిందనీ గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ధరూర్ ఎస్సై శ్రీహరి వెల్లడించారు. తల్లి మృతి చెందడం, తండ్రి హంతకుడిగా మారడంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలు అయ్యారు. దీంతో గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.



పెంట్యా నాయక్ ను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

కాంగ్రెస్ కార్యకర్తల

# జోలికొస్తే ఊరుకోను

- గొడవలు, దాడులు ఎవరు చేసినా సహించను
- గెలిచిన వారిని గౌరవించాలి.. ఓడిన వారికి అండగా ఉండాలి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఇతర పార్టీల వారు దాడులకు పాల్పడితే తాను చూస్తూ ఊరుకోనని, తమ కార్యకర్తలను టచ్ చేస్తే తాను కూడా కన్నెర్ర చేయాల్సి వస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఎలాంటి ప్రతీకా దాడులకు పాల్పడకూడదని,అలా చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసారు. సమాజంలో శాంతి భద్రతలు ప్రధానమని వ్యాఖ్యానించారు. మూడవ విడత పంచాయితీ ఎన్నికలు ముగిసిన తర్వాత గురువారం జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ తాండ లో బీఆర్ఎస్ కాంగ్రెస్ వర్గీయుల మధ్య, అలాగే గొల్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ బీజేపీ వర్గీయుల మధ్య దాడులు, గొడవలు జరిగిన నేపథ్యంలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాంగ్రెస్ –మిగతా4లో..



# పెరిగిన బిజెపి గ్రాఫ్..

- మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని పంచాయతీలలో సత్తా
- ఇద్దరు ఎమ్మెల్యేల సొంతూర్లలో కాంగ్రెస్‌ను ఓడించి ఘనత
- క్రమంగా పెరుగుతూ వస్తున్న ఓటింగ్ శాతం
- బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- రాష్ట్రం గ్రామాల్లో అమలు చేస్తున్న పనులన్నీ కేంద్రం నిధులే : ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌గర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ అనూహ్యంగా పుంజుకున్నది.ఇటీవల ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో నిర్వహించిన మూడువిడతల పంచాయతీ ఎన్నికల్లో తన సత్తా చాటింది.ముఖ్యంగా మహబూబ్‌గర్ పార్లమెంట్లో సెట్టింగ్ ఎమ్మెల్యేల సొంత గ్రామంలో అధికార పార్టీకి చుక్కలు చూపించి తనసత్తాను నిరూపించింది. ముఖ్యంగా మహబూబ్‌గర్ పార్లమెంట్లో ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బిజెపి గ్రామీణ ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకుంది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ లో సైతం పలు గ్రామాలు బీజేపీ కైవసం చేసుకోవడం విశేషం. ఓటింగ్ శాతం కూడా గతంలో 5శాతం ఉండగా ప్రస్తుతం సుమారు 16శాతానికి పెరిగినట్లు సమాచారం.

**పెరిగిన బీజేపీ గ్రాఫ్..**

మహబూబ్నగర్ పార్లమెంట్ సెగ్మెంట్లో ప్రతి గ్రామానికి బిజెపి విస్తరించిందని చెప్పవచ్చు. పదేళ్ల బిఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పార్టీల పాలనను కాదని బీజేపీ కి ప్రజలు మద్దతు పలికారంటే ఇట్టే అర్థమవుతుంది. గతంతో పోల్చితే సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు భారీగా పెరిగాయని చెప్పవచ్చు. దాదాపు ఇరవై పైగా స్థానాలలో స్వల్ప ఓట్ల తేడాతో.. రెండో స్థానంలో నిలిచిన బీజేపీ నిలిచినట్లు తెలుస్తున్నది. పలు చోట్ల బీజేపీ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు గెలిచినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా భావిస్తున్నారని బిజెపి నాయకులు మాట్లాడుతున్నారు. భారతీయ జనతా పార్టీకి రోజురోజుకి ప్రజాధారణ పెరుగుతుందని అనడానికి పంచాయతీ ఎన్నికలు ఒక నిదర్శనంగా చెప్పవచ్చు.

**ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లో బిజెపి కైవసం..**

మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామ పంచాయతీలలో బీజేపీ విజయం సాధించడం అందులోనూ జడ్చర్ల, నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రతి నిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు చిట్టెంపర్ణిక రెడ్డి, జనంపల్లి అనిరుద్ రెడ్డి సొంత గ్రామాల్లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. సీఎం సొంత నియోజకవర్గంలో సైతం బీజేపీ పలు గ్రామాల్లో గెలుపొందడం పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. ఈ సందర్భంగా బిజెపి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా స్వాగతిస్తున్నారని, కాంగ్రెస్,బీఆర్ఎస్ నేతల తాయిలాలకు, డబ్బు ప్రలోభాలకు తలొగ్గకుండా స్వచ్ఛందంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించారని చెబుతున్నారు.

## చరిత్రను తిరగరాశాం.. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..



బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 2019లో 163 సర్పంచ్ స్థానాలు సాధిస్తే ఇప్పుడు 750 సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్నాం. నగర పార్టీ అని ఎద్దేవ చేసిన వారికి ఇదే మా సమాధానం. చరిత్రను తిరగరాశాం.. ఇదే ఉత్సాహంతో 2028 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం. గ్రామాల అభివృద్ధి కేవలం కేంద్ర బీజేపీ సర్కార్ తోనే సాధ్యమని ప్రజలు నమ్మి..భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రజలు నిలుస్తున్నారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ గ్రామాలకు రూపాయి నిధులు ఇవ్వలేదు. గత ప్రభుత్వం సర్పంచ్ లకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల మోసాలతో ప్రజలు విసిగిపోయారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ కు అవకాశం ఇచ్చేనందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వివిధ గ్రామాల్లో ఉప సర్పంచ్ స్థానాలు దక్కించుకోవడంతో పాటు వందలది సంఖ్యలో వార్డు సభ్యుల స్థానాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో గెలుపొందడం జరిగింది. ఇరవైకి పైగా గ్రామాల్లో స్వల్ప ఓట్ల తేడాతో బీజేపీ రెండవ స్థానాన్ని దక్కించుకుంది. రాబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతాం. మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో ఇన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవడం తొలిసారి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, ఉజ్వల గ్యాస్,ఉచిత బియ్యం, వీధి దీపాలు, కొత్త రోడ్లు,శ్మశాన వాటికలు, మహిళా సంఘాలకు రుణాలు, మరుగుదొడ్లు, యువతకు స్వయం ఉపాధి పథకాలు అన్నీ కేంద్రం నిధులే. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం సాయశక్తులా పని చేసిన కార్యకర్తలకు అభినందనలు.

– మహబూబ్‌నగర్ ఎంపీ, డీకే అరుణ

# ముందస్తు అప్రమత్తతో విపత్తుల నివారణ

**వనపర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ముందస్తు అప్రమత్తత, సంసిద్ధత ద్వారానే విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం, ప్రకృతి విపత్తులు (వరదలు, పారిశ్రామిక ప్రమాదాల) నుంచి చేపట్టే రక్షణ చర్యలు, మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) అధికారులు మేజర్ జనరల్ సుధీర్ బల్, సయ్యద్ అదా హుస్సేన్ తో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలు నివారించగలుగుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ, సంసిద్ధతపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవిన్యూ ఖీమ్యా నాయక్ తో కలిసి హాజరయ్యారు.

**వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అధికారులు

వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. లైన్ డిపార్ట్మెంట్ ల అధికారులు అందరూ సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విపత్తుల కారణంగా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. విస్తృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో అన్ని లైన్ డిపార్టుమెంట్‌ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

మా పార్టీ పెద్దల వల్లే

# కాంగ్రెస్‌కి నష్టం

- నమ్మిన కార్యకర్తలకు నష్టం చేకూర్చి రాక్షసానందం
- సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పరోక్షంగా బిఆర్ఎస్ గెలుపుకు కృషి
- ఏఐసిసి, పీసీసీ,క్రమశిక్షణ సంఘంకు ఫిర్యాదు చేస్తా : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి ,డిసెంబరు 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాలతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ జండా మోసిన కార్యకర్తలకు నష్టం చేకూర్చి రాక్షసానందం పొందడం ఏంటని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మండిపడ్డారు.శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి నంది హిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 140 గ్రామపంచాయతీ స్థానాలకు ఇటీవల జరిగిన గ్రామసర్పంచ్ , వార్డు సభ్యుల ఎన్నికలలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన పై ప్రజలు తమ సంతృప్తిని ఓటు రూపకంగా తెలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను తమ మద్దతు తెలిపిన ఓటర్లకు,ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో 51 శాతం బీసీలను బరిలో దించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో 35.09 శాతం పెరిగిందన్నారు.బీఆర్ఎస్‌పార్టీకి వచ్చిన 51 గ్రామపంచాయతీ స్థానాలలో 1520 స్థానాలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ హైకమాండ్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే గా నాపై, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పై కోపం ఉంటే ప్రత్యేక్షంగా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ,జండా మోసిన కార్యకర్తలను టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ –మిగతా4లో..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# మందుల ధరలు తగ్గించాలి

- కంపెనీల దోడిపీని అరికట్టాలి
- తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ నిరసన

**మహబూబ్‌నగర్, డిసెంబర్19,ప్రభాతవార్త:** తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ సిఐటియు మహబూబ్నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ప్రజలకు వచ్చే వ్యాధులకు మందులు ధరలు అందుబాటులో లేవని, మందుల ధరలను తగ్గించాలని, కార్పొరేట్ మందుల కంపెనీలపై ప్రభుత్వం నియంత్రణ విధించాలని పలు డిమాండ్లతో నిరసన వ్యక్తం చేశారు. మెడికల్ అండ్ సేల్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలో భాగంగా మహబూబ్నగర్ కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున్ ,శోభన్ యాదవ్ సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు కిల్లే గోపాల్, సీనియర్ నాయకులు ఆర్ రామ్ రెడ్డి,కమరాలి తదితరులు మాట్లాడారు. దేశంలో ప్రాణాంతకమైన మందులు ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు మందులు కొనుగోలు చేయలేక అరచేతిలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, మందుల కంపనీల దోపిడీని అరికట్టాలని, మెడికల్ సేల్స్ ప్రమోషన్ యాక్ట్ ను పునరుద్ధరించి, మెడికల్ రిప్పులకు కనీస వేతనాలు 26,000 అమలుపరచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మేనేజ్మెంట్ల ఒత్తిడి ఫలితంగా వేధింపులకు గురై అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మెడికల్ రిప్స్ జీవన భద్రత ,,ఉద్యోగ భద్రత వేతనాలు తదితర వాటి విషయంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లు తెచ్చి వారి హక్కులను హరిస్తున్నారని, ఎలాంటి హక్కులు లేకుండా మెడికల్ రిప్స్ పై మేనేజర్లు సూపర్వైజర్లు వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని, తక్షణమే కేంద్ర బిజెపి ప్రభుత్వం మందుల కంపెనీలపై నియంత్రించాలని, ధరలను అరికట్టాలని ప్రాణాంతకమందులకు సబ్సిడీలు ఇవ్వాలని, కార్మికుల సమ్మె హక్కు,పోరాడే హక్కులు యధావిధిగా ఉంచాలని ,రాబోయే కాలంలో కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఇందులో విష్ణువర్ధన్, రమేష్, కమంర్ అలీ, రమణ, రాజ్ కుమార్, రమణారెడ్డి, రఘు, భాను, శివ,రాఘవేందర్, అమర్, ఇమ్రాన్, మాధవ్, భద్రయ్య,రమేష్, మురళి, సంతోష్,తదితరులు పాల్గొన్నారు అనంతరం లేబర్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

# అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

- ఉత్సాహంగా 3వ జిల్లా స్థాయి పోటీలు షురూ
- ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్



జ్యోతి ప్రజ్వలతోనే జిల్లా స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి




మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్

**జడ్చర్ల, డిసెంబర్19,ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని నాగసాల వద్ద మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో లో నిర్వహిస్తున్న 3వ జోష్ జిల్లా స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025-2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ కూడా పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతమైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మన జిల్లా వాసిగా ఉండడం అదృష్టకరమని తెలిపారు. రాష్ట్రంలో త్రిబుల్ ఐటీ కళాశాల బాసరలో ఉండేది, కొత్తగా జడ్చర్ల మహబూబ్‌గర్ మధ్యలో త్రిబుల్ ఐటీ కళాశాల మంజూరు కావడం జిల్లా ప్రజలు హర్షించాల్సిన అంశమని వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత నరసింహులు, స్థానిక కౌన్సిలర్,ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




కవాతులో పాల్గొన్న విద్యార్థులు



పిరమిడ్ రూపంలో..

## ఘనంగా మన్నె జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నవాబుపేట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ముఖ్య నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త మన్నె జీవన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జీవన్ రెడ్డి అభిమానులు శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వ హించగా , ఎంజెఆర్ అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. అభిమానులు యువకులు జై జీవన్ రెడ్డి ఎంజెఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలతో టపాసులు పేల్చి వారి అభిమానాన్ని చాటుకున్నారు. గురుకుంట గ్రామపంచాయతీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రవీందర్ రెడ్డిని, డిప్యూటీ సర్పంచ్ రాజశేఖర్ ను సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పదవులు ప్రధానం కాదని, ప్రజల అభిమానమే ప్రధానమన్నారు. ఎంజెఆర్‌కు ఏ పదవి లేకున్నా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు అన్నివేళలా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారని అభిమానులు తెలియజేశారు. గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు ఎంజెఆర్ అభిమాన శ్రేణులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మన్నె జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## విదేశాల చదువుల కోసం దరఖాస్తులు చేసుకోండి

**జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నుషిత**

**గద్వాలటౌన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా విభాగంలో పీజీ కోర్సులకు సంబంధించి 01.07.2025 నుండి 31.12 .2025 వరకు అడ్మిషన్ పొందిన వారు మాత్రమే అర్హులని, అర్హులైన వారు ఆన్లైన్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలనీ అన్నారు. నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎస్ఎస్సి, ఇంటర్, డిగ్రీ మరియు ఇతర ధృవ పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ 19.01.2026 మరియు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి యొక్క హార్డ్ కాపీలను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం నందు 20.02.2026 లోపు సమర్పించాలని, ఇతర వివరముల కోసం 8099059007 నెంబర్ను సంప్రదించాలని కోరారు.



## నిడ్జింత పాఠశాలలో చదువుల పండుగ

**కార్యక్రమాన్ని ప్రారంభించిన నూతన సర్పంచ్**

**మద్దూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు-కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద వేదిక మ్యాథ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ నూతన సర్పంచ్ సి.రజిత, శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ బి. సుజాత, అంజనేయులులు ఘనంగా ప్రారంభించారు.గణితం సులభంగా, ఆసక్తికరంగా నేర్చుకునే విధంగా ఈ వేదిక మ్యాథ్స్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.అంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వేదిక మ్యాథ్స్ డైరెక్టర్ మురారి, మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు విజయ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం కె. శ్రీనివాస్ సార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇటువంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.


చదువుల పండగ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

## మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రజలను నిందించడం తగదు

**ఆత్మకూర్ డిసెంబర్ 19, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆత్మకూరు మండలంలోని మూలమల్ల మరియు పిన్నంచర్ల గ్రామాల ప్రజలను నిందించడం ఆత్మకూరు మార్కెట్ కమిటీ చై ర్మన్ రహమతుల్లాకు ఎంత మాత్రం తగదని ఆత్మకూరు మండ ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ టీఆర్ఎస్వీ నాయకులు రియాజ్ అలీ తది తరులు తీవ్రస్థాయిలో ఆక్షేపిం చారు. సాక్షాత్తు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రివర్యుల సమక్షంలోనే మార్కెట్ కమిటీ చైర్మన్ మూలమల్ల మరియు పిన్నంచర్ల గ్రామాలలో బిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించడం ప్రజలకు సిగ్గుచేటని వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పం చులతోపాటుగా ఆయా గ్రామాల ప్రజలను అవమానకరమైన పద్ధతిలో మాట్లాడిన మార్కెట్ కమి టీ చైర్మన్ రహమతుల్లా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదా రాష్ట్ర మంత్రి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎన్నికైనప్పటికీ వ్యవహరించామని అంతేకాకుండా ఆయా గ్రామాలను అభివృద్ధిపరిచే కార్యక్రమాలను తమ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం తమకు ఓటు వేయకపోతే ప్రజలను నిందించడం మానుకోవాలని హితోపలికారు.


రవికుమార్ యాదవ్

## మైనారిటీ విద్యార్థుల కోసం

## సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం

**ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం**

**నారాయణ పేట,డిసెంబరు 19 ప్రభాతవార్త :**తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలులో ఉన్న చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం (సిఎంఓఎస్ఎస్) – ఫాల్ సీజన్ 2025 కింద మైనారిటీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్ తెలిపారు.ఈ పథకానికి ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన,బౌద్ధ,పార్సీ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అమెరికా,యూకే, కెనడా, జర్మనీ, జపాన్,ఫ్రాన్స్ తదితర దేశాల్లోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో 01072025 నుంచి 31122025 మధ్య పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తెలంగాణిపాస్.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో 19012026 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన అనంతరం హార్డ్ కాపీతో పాటు అవసరమైన పత్రాలను 2002,2026 సాయంత్రం 5గంటలలోపు జిల్లామైనారిటీ సంక్షేమశాఖ, నారాయణ పేట కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయంతో పాటు రూ.60,000 వన్‌వే విమాన ఛార్జీ మంజూరు చేయబడుతుందని తెలిపారు. పత్రాల పరిశీలన సమయంలో నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.వయస్సు,ఆదాయం,విద్యార్హత తదితర పూర్తివివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. పేట జిల్లాలోని అర్హులైన మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎం.ఏ. రషీద్ విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థను

## బలోపేతం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం :ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమైందని, గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని తమిళనాడు ఏఐసీసీ పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంతో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గెలుపొందిన సర్పంచులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంతో పరిపాలన సాగించాలని, గ్రామాలలో పారదర్శ కత ఉండాలని గెలుపొందిన సర్పంచ్‌లకు సూచించారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా అందరిని కలుపుకొని పోయి గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని సర్పంచులకు సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తమిళనాడు ఏపిసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. చిక్కుడు వంశీకృష్ణ, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.


పెనిమిళ్ళ సర్పంచును సన్మానిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

# విపత్తు సమయంలో అవసరమైన సేవలు అందించేందుకు కృషి

**గద్వాలటౌన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ఏదైనా విపత్తు సమయంలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు జోగులాంబ గద్వాల జిల్లాలో సంబంధిత అధికార యంత్రాంగం కృషి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్ ఎక్సర్సైజ్ గురించి శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్‌డిఎంఎ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ వరదలు, పరిశ్రమల, రహదారుల ప్రమాదాలే కాక వివిధ రకాలుగా జరిగే విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ముందు జాగ్రత్తలపై సంబంధిత శాఖల యంత్రాంగానికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి రిలీఫ్ క్యాంపులలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివిధ ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు సమయంలో నీటిపారుదల, విద్యుత్, రహదారుల, పోలీస్, వైద్య, పౌరసరఫరాల, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు ఏటా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గద్వాలలోని ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో గుర్రంగడ్డ గ్రామం చుట్టూ కృష్ణానదికి వరద ఎక్కువగా వచ్చే సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలు ఉండవని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి గ్రామస్తులను ముందుగానే అప్రమత్తం చేయడంతో వారికి కావలసిన నిత్యావసర సరుకులు సమకూర్చుకోవడం జరుగుతుందన్నారు. విపత్తు నిర్వహణ సమయంలో జిల్లాలో ఎస్‌డిఆర్ఎఫ్ తో పాటు పదవ బెటాలియన్ పోలీస్ బృందాలు అప్రమత్తంగా ఉంటున్నాయన్నారు. మిగిలిన లైన్ డిపార్ట్మెంట్ అధికారులందరూ అవసరమైన సహాయక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, ఆర్అండ్ బి ఈఈ ప్రగతి, జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు



కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు

## ప్రవాస జీవితం నుంచి ప్రజా సేవకు..

### ఉప్పరిపల్లిలో ఘన విజయం సాధించిన బొజ్జ శ్రీ గీత అమరేందర్ రెడ్డి

**ఉప్పునుంతల,డిసెంబరు 19 ప్రభాతవార్త :** ప్రవాస జీవితం వదిలి ప్రజాసేవకై స్వదేశానికి తిరిగి వచ్చి గ్రామీణాభివృద్ధికి అంకితమ వుతున్న ఎన్నారై బొజ్జ అమరేందర్ రెడ్డి కుటుంబానికి ప్రజలు ఘనమైన మద్దతు పలికారు. మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీకి జనరల్ మహిళ రిజర్వేషన్ కేటాయింపు లో భాగంగా ఆయన సతీమణి బొజ్జగీత అమరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ(రెబల్)అభ్యర్థిగా బరిలో నిలిచారు.ప్రవాస భారతీయుల కాంగ్రెస్ విభాగం తరపున ప్రగతిభవన్‌లో సేవలందించిన బొజ్జ అమరేందర్ రెడ్డి, గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప్పరపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీ పడగా, ఈనెల 17న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బొజ్జ గీత అమరేందర్ రెడ్డి 200లకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను ఘనంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే తమ ప్రధాన లక్ష్యమని నూతన సర్పంచ్ గీత అమరేందర్ రెడ్డి తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసి అభినందించిన వారిలో ఎన్నారై అడ్వైజర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రేసోజు శ్రీనివాసా చారి, వార్డు సభ్యులు తదితరులున్నారు.


అచ్చంపేట ఎమ్మెల్యే ను కలిసిన
ఉప్పరి పల్లి సర్పంచు బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, బొజ్జ రవీందర్ రెడ్డి

## ఉపాధి హామీ పథకం రక్షించుకుందాం

**ఆత్మకూర్ డిసెంబర్ 19,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కూలీల పొట్ట కొట్టే విధంగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పండుతుందని కూలీలు ఐక్యంగా పోరాడి ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకుందామని సిఐటి జిల్లా నాయకులు ఆత్మకూర్ సిపిఎం మండల కార్యదర్శి ఎస్ రాజు అన్నారు. శుక్రవారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని రక్షి ంచాలంటూ గ్రామపంచాయతీ సెక్రటరీ జైపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 40 శాతం కూలీలు ఈ పథకంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లు మరియు బడ వ్యాపారవేత్తలకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతోందని అందులో భాగంగానే ఉపాధి హామీ పథకంలో జెసిబిలు మరియు యంత్రాలను వాడొచ్చు అంటూ స్పష్టంగా పేర్కొన్న నేపథ్యంలో కూలీల బతుకులు ఆగమ్య గోచరంగా మారుతాయి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దేశానికి స్వాతంత్రం సిద్ధింపజేసిన మహాత్మా గాంధీ పేరును తొలగించి జి.రాంజీ పేరిట మతతత్వ భావాలు నిలకలుపే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గా నామకరణం చేయాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, భారతీయుడు తదితరులతోపాటుగా ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శి కి సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## యూరియా పంపిణీకి ఫర్టిలైజర్ యాప్ అమలు

### 20 నుంచి స్లాట్ బుకింగ్ ఉన్న రైతులకే అమ్మకాలు

**మద్దూర్, డిసెంబరు 19: ప్రభాతవార్త :** రైతులకు అవసరమైన యూరియాను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఫర్టిలైజర్ (యూరియా) బుకింగ్ యాప్‌ను అమలు చేస్తోందని మద్దూర్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా యూరియా కోసం ముందుగా స్లాట్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. రైతుల సగటు వినియోగాన్ని ఆధారంగా చేసుకొని యూరియా పంపిణీ జరగడంతో పాటు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని తెలిపారు. క్యూలైన్లు, గందరగోళం లేకుండా ప్రతి రైతుకు అవసరమైన మేరకే యూరియా అందే విధంగా ఈ విధానం రూపొందించబడిందన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి యూరియా అమ్మకాలు పూర్తిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఆ తేదీ నుంచి యాప్‌లో బుకింగ్ లేకుండా యూరియా సరఫరా చేయబడదని తెలిపారు. రైతులందరూ ఈ కొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకొని, అవసరమైతే వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో యాప్ ద్వారా సులభంగా యూరియా బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ కోరారు.


ప్రవీణ్ కుమార్

## ప్రతి విద్యార్థిలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి : ఎంఈఓ

**దామరగిద్ద, డిసెంబరు 19 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో ప్రాథమిక పాఠశాల స్థాయి సముదాయ సమావేశం మండల విద్యాధికారి కృష్ణరెడ్డి, జిహెచ్‌ఎం సురేష్ అధ్యక్షతన సమావేశం ప్రారంభం అయింది. ఈ సమావేశానికి వివిధ పాఠశాలల నుండి 50 ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈఓ కృష్ణరెడ్డి మాట్లాడుతూ ఫౌండేషనల్ లీటరసీ నూమెస్రీ కార్యక్రమంలో బాగంగా 3వ తరగతి విద్యార్థులకు కనీస సామర్థ్యలు తెలుసుకొనుటకు ఫిబ్రవరి,2026 నెలలో దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ ప్రతి ఉపాధ్యాయులు విద్యార్థులను ఇప్పటి నుండి సంసిద్దులుగా చేయాలని సూచనలు చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ హాజరై మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యలు రావాలని సూచనలు చేశారు. ఉపాధ్యాయులందరు కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. మన జిల్లాకు మంచి పేరు తీసుకొనిరావాలని తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ నరేష్ ఉసెనప్ప, జానకిరాములు, సిఆర్‌పిలు మహిపాల్, రాములు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాధికారి కృష్ణారెడ్డి, జిహెచ్ఎం సురేష్

## గ్రామాల అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర,డిసెంబరు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి ఒక్క కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలో ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి గా పోటీచేసి గెలిచిన కోమరి బాలరాజ్, బిఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డ్ మెంబర్లు మబ్బు వెంకట్ రాములు, వన్నం ఆంజనేయులు, గద్వాల చిన్న బురాన్, బిఆర్ఎస్ నాయకులు ఉప్పరి బాలు, నక్కబురాన్, రాజ్ కుమార్, వన్నం అశోక్, వన్నం ఆశన్న, తదితరులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నూతన సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోపన్ పల్లి శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.


గోపన్ పల్లి సర్పంచ్, వార్డ్ మెంబర్లు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన దృశ్యం

## టెట్ పరీక్షను వాయిదా వేయాలి

**పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**

**మహబూబ్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రాష్ట్రంలో జనవరి 3 నుంచి జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను కొన్ని రోజులు వాయిదా వేయాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేందర్ సాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ఇరవై రోజులుగా రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతను నిర్వర్తించారని, దాని వల్ల టెట్ పరీక్షకు సిద్ధమవడానికి తగిన సమయం వారికి లభించలేదని పేర్కొన్నారు. టెట్ పరీక్షకు సిద్ధమవ్వడానికి వారికి మరింత సమయం కావాలని అందుకే జనవరి నెలలో జరగనున్న ఈ పరీక్షను వాయిదా వేయాలని ఒక ప్రకటనలో కోరారు.



## పేరూర్ సర్పంచ్ దంపతులకు

## శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే


పేరూర్ గ్రామ సర్పంచ్ దంపతులను పూలబొకే తో ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే దంపతులు

**దేవరకద్ర,డిసెంబరు 19 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన శృతి అరవింద్ రెడ్డి దంపతులను పూల బొకే, శాలువాతో సన్మానించి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ లు ముందుండి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి గురుకుల

## పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**వడ్డేపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** మండలంలోని ఐజ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం లో చదువుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుండి 21జనవరి 2026 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



## అభివృద్ధి సంక్షేమం దిశగా కృషి చేస్తా

**వార్డ్ మెంబర్ రవీందర్ రెడ్డి**

**దేవరకద్ర,డిసెంబరు 19 ప్రభాతవార్త:** కౌకుంట్ల గ్రామంలో మౌలిక వసతుల, అభివృద్ధి సంక్షేమం దిశగా కృషి చేస్తానని మూడవ వార్డు శాంతం గారి రవీందర్ రెడ్డి అన్నారు. నన్ను ఆదరించి రెండోవసారి వార్డ్ మెంబర్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని వెల్లడించారు. గ్రామాల అభివృదే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందే విధంగా ప్రత్యేక చొరవ చూపుతానని వివరించారు. వార్డులో ఏమైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకొస్తే, ఆ సమస్యను గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా నా వంతు బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## మృతురాలి కుటుంబాన్ని పరామర్శ

**వెల్దండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:**వెల్దండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నేనావత్ జిజా అనారోగ్యం తో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజి నాయక్, నేనావత్ తారాసింగ్, వార్డు సభ్యులు బాణావత్ శంకర్, పాత్లావత్ కృష్ణ, బాణావత్ సంతోష్, నాయకులు ఇస్లావత్ బాలు, మెండే శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లా టోర్నీకి క్రికెట్ జట్టు ఎంపిక

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట కోసం క్రికెట్ క్రీడాకారుల ను ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ఎంపికను గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డున గల క్రికెట్ మైదానంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన



ఉమ్మడి జిల్లా టోర్నీకి ఎంపికైన క్రికెట్ జట్టు

క్రీడాకారులు ఈనెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 4 లీగ్ మ్యాచ్ చొప్పున నిర్వహించి ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 16 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఏం రామ్ చరణ్, యన్,గగన్, జే,జస్వంత్, వివేక్, అర్షద్ అహ్మద్, ఎన్.సాత్విక్ రెడ్డి, ఎం.క్యాతేశ్వర్, పి.సుబ్రత్ కౌశిక్, ఆర్.చరణ్, మహమ్మద్ ముజ్తబా,పి. అభిరామ్, అంజి, ఎన్,జస్వంత్, మహమ్మద్ షాహిద్ ఆఫ్రిది, బి.సంజయ్, శామ్యూల్ జోసెఫ్‌లు ఎంపికయ్యారు.ఈ సెలక్షన్ ప్రక్రియలో మహమ్మద్ మన్నాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 21న బాలికల షూటింగ్ బాల్ ఎంపికలు

**మక్తల్ టౌన్,డిసెంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. శ్రీనివాసు లు, సిహెచ్. ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి. గోపాలం ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం ఉదయం 10 గంటలకు మక్తల్ సాయి జ్యోతి ఉన్నత పాఠశాల సంఘం బండ రోడ్డులో నారాయణపేట జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ మహిళల, పురుషుల షూటింగ్ బాల్ జట్లను ఎంపికచేయడం జరుగుతుంది,కావున క్రీడలలో ఆసక్తిగల రెండుజిల్లాల( నారాయణపేట, మహబూబ్‌నగర్) బాలురు, బాలికలు, పురుషులు ,మహిళలు ఆధార్ కార్డ్ ,బోనో ఫైడ్, క్రీడా దుస్తులు ధరించి హాజరు కావాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్య ఆంజనేయులు, ఎస్. రమేష్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో క్రీడా నైపుణ్యతను ప్రదర్శించిన క్రీడాకారులను క్రీడాకారులు ఎంపిక చేసి ఈ నెల 24 నుండి 26 వరకు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం, అన్నారం షరీఫ్ గ్రామంలో జరుగు రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు పంపుతామని రమేష్ తెలిపారు. రెండు జిల్లాల సీనియర్ షూటింగ్ బాల్ పోటీలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ప్రారంభిస్తారని ఎస్. రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. అడమ్స్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి బి. పుష్ప పి ఈటి, కోశాధికారి రవి పిఈటి పాల్గొంటారని రమేష్ తెలిపారు.

## రైతుల ఖాతాల్లో నగదు పడేలా చర్యలు...!!

**అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్**

**వనపర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** జిలాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి మిల్లుల నుంచి ట్రక్ షీట్లు తెప్పించుకొని, ట్యాబ్ ఎంట్రీలను పూర్తి రైతుల ఖాతాల్లో వెంటనే నగదు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం అదనపు



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

కలెక్టర్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి న అంశంపై సంబంధిత అధికారులతో సమా వేశం నిర్వహించి, మండలాల వారీగా సమీ క్షి ంచారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి దాన్యం కొనుగోలు చేసిన తర్వాత వారికి నగదు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో టాబ్ ఎంట్రీ ఆలస్యం కావడం కారణంగా రైతుల ఖాతాల్లో నగదు జమ కావడం ఆలస్యం అవుతుందని అలా జరగకుండా చూడాలన్నారు. వేగంగా రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి మిల్లుల నుంచి ట్రక్ షీట్లు తెప్పించుకొని, ట్యాబ్ ఎంట్రీలను పూర్తి రైతుల ఖాతాల్లో వెంటనే నగదు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, డిఆర్‌డిఓ ఉమాదేవి, డిసీఓ, ఏపీఎంలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై కేసులు పెట్టడం అమానుష చర్య

**నారాయణ పేట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** విద్యార్థుల రవాణా సమస్యలపై ప్రశ్నించినందుకు విద్యార్థి సంఘ నాయకులు, జర్నలిస్టులపై నాన్‌బెయిల్ కేసులు నమోదు చేయడం తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఈ నెల 17న నారాయణపేట బస్టాండ్ నుంచి గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి ఎనిమిదైనా బస్సులు రాకపోవడంతో బాలికలతో సహా పలువురు విద్యార్థులు ఆకలితో అలమటించారు. దీనిపై స్పందించిన విద్యార్థి సంఘాలు బస్సులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేసినా డిపో మేనేజర్ స్పందించలేదని ఆరోపించారు. దీంతో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సాయికుమార్, నరహరి, ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు విద్యార్థి సంఘ నాయకులతో పాటు ఘటనను కవరేజ్‌కు వచ్చిన రిపోర్టర్లపై నాన్‌బెయిల్ కేసులు నమోదు చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి.

## 22ఫుట్‌బాల్, 23న అథ్లెటిక్ ఎంపికలు

**- పీయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులు**

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 19,ప్రభాతవార్త:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే సౌత్ జోన్ ఆల్ ఇండియా ఇంటర్నెట్ టోర్నమెంట్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ ఫుట్ బాల్ , అథ్లెటిక్స్ పురుషుల విభాగంలో 22న ఫుట్ బాల్, 23న అథ్లెటిక్స్ ఎంపికలు ఉంటాయని పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులు ఒక ప్రకటనలు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు స్పోర్ట్స్ యూనిఫామ్ తో తమ తమ కాలేజీకి సంబంధించిన బోనాఫైడ్ సర్టిఫికెట్ పై ఆ కాలేజీ యొక్క ప్రిన్సిపల్ సంతకం చేసుకుని 17 నుండి 25 సంవత్సరాల మధ్య వయసు గల క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని ఆ క్రీడాకారులు కూడా పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధ కళాశాలలో చదువుతున్న వారే ఉండి ఉదయం 9 గంటలకు ఫుట్ బాల్ మహబూబ్ నగర్ స్టేడియం గ్రౌండ్ న్యూ బస్ స్టాండ్ దగ్గర అథ్లెటిక్స్ పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ అథ్లెటిక్స్ గ్రౌండ్ నందు హాజరుకావాలని ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఫుట్ బాల్ జనవరి1నుంచి జనవరి 11వరకు యూనివర్సిటీ, హైదరాబాద్ తెలంగాణ లో మరియు అథ్లెటిక్స్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ సైన్సెస్ లో 12 నుండి 16వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని, అలాగే ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ రిజిస్ట్రర్ పూస రమేష్ బాబు గారు హాజరవుతున్నట్లు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**వనపర్తి,డిసెంబరు 19 ప్రభాతవార్త:** వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కీర్తిశేషులు బలరాం యాదవ్ సతీమణి సీతమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడిమేఘారెడ్డి శుక్రవారం కడుకుంట్ల గ్రామంలోని వారి కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సీతమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహార్థం వారికి ఆర్థికసహాయాన్ని అందించారు.కుటుంబానికి తను ఎల్లప్పుడూ అండదండగా ఉంటారని భరోసా కల్పించారు.అనంతరం అదేగ్రామానికి చెందిన చిలుక బుచ్చన్న ఇటీవలే గుండె ఆపరేషన్ చేయించుకున్న సంగతి తెలుసుకునే ఎమ్మెల్యే బాధితుని పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులకు ఘన సన్మానం

**దామరగిద్ద, డిసెంబరు 19 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ముదిరాజ్ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్‌లను ముదిరాజ్ మహా సభ ముఖ్య నాయకులు సన్మానించారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువా సన్మానించి మున్ముందు జరగబోయే



ముదిరాజ్ సర్పంచ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ఎంపీటీసీ,జడ్పీటీసీ, ఎన్నికలో ముదిరాజ్ నాయకులు,యువత ఇలాగే కలిసి కట్టుగా ఉండి అత్యధిక స్థానాలను గెలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పటేల్ శ్రీను ముదిరాజ్,మన్నపూర్ రవి ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప ముదిరాజ్, మండల అధ్యక్షులు,సర్పంచ్ కావలి మొగులప్ప,మాజీ ఎంపీటీసీ శేఖర్, కంసాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్, కానుకుర్తి గ్రామ సర్పంచ్ నారానోళ్ళ నారాయణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కోసం అధికార పార్టీలో

### బిఆర్.ఎస్ , ఇండిపెండెంట్‌గా గెలిచిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ఇటిక్యాల డిసెంబర్ 19, ప్రభాతవార్త:** అల్లంపూర్ నియోజకవర్గంలో 3వ విడతలో ఈనెల 17వ తేదీన జరిగిన సర్పంచ్. వార్డు మెంబర్లు ఎన్నికలు పూర్తికాగా బి ఆర్.ఎస్ పార్టీ మద్దతుతో బరిలోకి నిలిచి గెలిచిన కొత్త సర్పంచులు. ఉప సర్పంచ్.వార్డు మెంబర్లు. అలాగే స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్. ఉప సర్పంచ్. వార్డ్ మెంబర్లు గ్రామాల అభివృద్ధి కోసం అధికార పార్టీలోకి చేరుతున్నామంటూ గెలిచిన కొత్త సర్పంచ్‌లు శుక్రవారం శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బి ఆర్.ఎస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్ ఎన్ కల్పన శంకర్ నాయుడు. బి ఆర్.ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి అభినందించారు. అలాగే ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామపంచాయతీ నుండి స్వతంత్ర సర్పంచ్



ఎన్.కల్పన శంకర్ నాయుడు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

అభ్యర్థిగా బరిలో నిలిచి సమీపఅభ్యర్థి పై 861 ఓట్ల భారీ మెజార్టీతో సర్పంచ్‌గా అంచమ్మ రాజేష్ గెలుపొందారు. అలాగే ఉప సర్పంచ్ దర్శ మహమ్మద్. వార్డు మెంబర్లు కలిసి వారు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరగా అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్



సాతర్ల గ్రామ ఇండిపెండెంట్ గా గెలిచిన సర్పంచ్. ఉప సర్పంచ్.వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే సంపత్

కుమార్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి ఘనంగా వారిని సత్కరించి అభినందించారు. అంతేకాక పలువురు గ్రామాల కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచి గెలిచిన సర్పంచులు సైతం క్యాంపు కార్యాలయానికి వచ్చి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ను కలుస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ గెలిచిన సర్పంచ్. ఉపసర్పంచ్. వార్డ్ మెంబర్లను ఘనంగా సన్మానిస్తూ అభినందిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, ఇటిక్యాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుక్మానందరెడ్డి, సాతర్ల మాజీ సర్పంచ్ జయ చంద్రారెడ్డి, నరసింహులు యాదవ్, బీసి రెడ్డి, రాజు, రవి తదితరులు ఉన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**గద్వాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను గద్వాల జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. రవికుమార్ అన్నారు.శుక్రవారం గద్వాల న్యాయస్థానంలోని తమ ఛాంబర్‌లో అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి టి.లక్ష్మితో కలిసి జాతీయలోక్ అదాలత్ పై ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులు సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించబడతాయన్నారు. గద్వాల్ లోని న్యాయస్థాన ప్రాంగణంలో ఈనెల 21న ఆదివారం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీ

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీ పద్ధతిలో కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు,అన్ని రకాల సివిల్ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుని తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు.రాజీ కుదిరితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లించబడతాయని పేర్కొన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు,రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసులపై సంబంధించిన ఇరుపక్షాల సమ్మతితో రాజీతో పరిష్కారమయ్యే కేసులన్నింటినీ పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. వివిధ కారణాలతో గాయపడి లోక్ అదాలత్ కు రాలేని కక్షిదారులు కూడా ఆన్లైన్లో కనిపించి మాట్లాడినా రాజీ కుదురుచడం జరుగుతుందన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పేరుకు పోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి విశేష కృషి చేస్తుందన్నారు. రాజీ మార్గం రాజమార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.

# గృహహింస చట్టాలపై అవగాహన ఉండాలి

**- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి డి ఇందిరా**

**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్19,ప్రభాతవార్త:** రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి డి ఇందిరా శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా లోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ సేవల చట్టం, గృహ హింస నిరోధక చట్టం, తదితర చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళలు, పేదలు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం గురించి కూడా వివరించారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన సమస్యలు, బాలల హక్కుల ఉల్లంఘన, సమాజంపై





అవగాహన కల్పిస్తున్న డి ఇందిరా

పడే దీర్ఘకాలిక ప్రభావాల గురించి వివరించారు.బాల్య వివాహాల నివారణలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడం, బాధిత బాలికలకు న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం అవసరమని సూచించారు.అలాగే చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి, చట్టపరమైన శిక్షలు, ప్రభుత్వ పథకాలు, రక్షణాత్మక చర్యలపై పారా లీగల్ వాలంటీర్లకు స్పష్టమైన అవగాహన కల్పించారు. సమాజంలో బాల్య వివాహాలు లేని భారతదేశం సాధించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో న్యాయ సేవల సంస్థ ప్రతినిధులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు, అట్రాక్షన్‌కు లోనైతే

# బాలికల జీవితం అంధకారంలోకి నెట్టబడుతుంది

**నారాయణ పేట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా మరికల్ మండలం బాలికల ప్రభుత్వ హైస్కూల్‌లో చైల్డ్ హెల్ప్ లైన్-1098 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయకర్త జి.నర్సింహులు మాట్లాడుతూ పిల్లలకు స్వేచ్ఛ, అభివృద్ధి, రక్షణ హక్కులు ప్రతి బాలుడికి వర్తిస్తాయని తెలిపారు. పేట జిల్లాలో ఉన్న బాల రక్షక్ భవన్లో 24/7 గంటలు చైల్డ్ హెల్ప్ లైన్ (1098) సిబ్బంది అందుబాటులో ఉంటారని, సమస్యలో ఉన్న పిల్లలు కాల్ చేసిన వెంటనే రక్షణ,సంరక్షణ కల్పిస్తామని చెప్పారు. బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండేలా చూసే బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పాల్గొన్న విద్యార్థులు

సమాజమంతటిదని తెలిపారు. బాల్య వివాహాలు,లవ్ అండ్ అట్రాక్షన్‌కు లోనైతే బాలికల జీవితం అంధకారంలోకి నెట్టబడుతుందని హెచ్చరించారు. పిల్లలకు సమస్యలు ఎదురైతే హెల్ప్ లైన్ 1098ను ఎలా ఉపయోగించుకోవాలో, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించే సదుపాయాల గురించి వివరించారు ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బాలరాజు మాట్లాడుతూ,లవ్ అండ్ అట్రాక్షన్‌కు లోనుకాకుండా మంచి ఆలోచనలు, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ కృష్ణతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్ల మంటలతో గడ్డి వాము దగ్ధం

### నాలుగు గేదెలు సజీవ దహనం

**ధన్వాడ,డిసెంబరు19 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని గోటూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం హృదయవిదారక సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాంరెడ్డికి సంబంధించిన గడ్డి వాము మీదుగా వెళ్లిన విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గడ్డివాము పూర్తిగా దగ్ధమై, అక్కడే ఉన్న రెండు పెద్ద గేదెలు, రెండు చిన్న గేదెలు సజీవ దహనం అయ్యాయి.అదే సమయంలో పశువుల షెడ్డుతో పాటు అక్కడ నిల్వ ఉంచిన 20 బస్తాల మందు సంచులు కూడా పూర్తిగా కాలిపోయాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా పశువులను కాపాడలేకపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చే లోపే తీవ్రంగా నష్టం జరిగిపోయింది.



విద్యుద్ఘాతానికి గురై సజీవదహనమైన గేదెలు

**విద్యుత్ తీగల నిరక్ష్యమే కారణం?** గడ్డివాము పైనుంచి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగిందని బాధిత రైతు రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన లబోదిబోమంటున్నారు. గ్రామానికి సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఈ తరహా విద్యుత్ లైన్లు రైతులకు ప్రాణాంతకంగా మారుతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో రైతుకు లక్షల రూపాయల మేర నష్టం జరిగినట్లు గ్రామ పెద్దలు అంచనా వేస్తున్నారు. పశువులే జీవనాధారంగా ఉన్న రాంరెడ్డికి ఇది తీరని లోటుగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, గ్రామ పరిధిలోని ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ ఘటన ధన్వాడ మండలంలో కలకలం రేపగా, రైతుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం మరోసారి ప్రశ్నార్థకంగా నిలిపింది.

## ఎస్‌బీఐ జీవనం ప్రాజెక్టు ద్వారా కళా జాతర



కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో భవిష్య ఎస్‌బీఐ జీవనం ప్రాజెక్టు ద్వారా కళాజాత కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరంజని సాంస్కృతిక బృందం నాయకత్వం వహించిన రవికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సింధు, టీబి నోడల్ పర్సన్ మధుసూదన్‌లు పాల్గొన్నారు.కళాజాతలో క్షయ వ్యాధి, టీబి కారణాలు, చికిత్స సేవలు పోషకాహార ప్రాముఖ్యత గృహస్థాయిలో టీబీ నివారణపై ప్రజలకు జానపద గీతాలు ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 115 మందికి టీబి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోజ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ సాజద్ అలీ, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం : ఎంపీడీఓ

**వెల్దండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచుల ప్రమాణ స్వీకారం ఈనెల 22 సోమవారం ఉంటుందని ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యపా ల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామపంచాయతీలలో సర్పంచులతో



పాటు వార్డు సభ్యులు ఉపసర్పంచ్‌ల ప్ర మాణ స్వీకారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఉంటుందని ఆయా గ్రామపంచాయ తీల కార్యదర్శుల చేత ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉంటుందని కార్యక్రమానికి తప్పకుండా సర్పంచులు వార్డు సభ్యులు ఉపసర్పంచులు ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని అన్నారు.

## ఊర్కొండ మండలానికి ప్రభుత్వ సర్వేయర్‌ను నియమించాలి

**-కల్వకుర్తి ఆర్డీఓకు వినతి పత్రం**



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఊర్కొండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలానికి ప్రభుత్వ సర్వేయర్‌ను నియమించాలని ఊర్కొండ సర్పంచ్ మేకల మంజుల శ్రీనివాసులు శుక్రవారం కల్వకుర్తి ఆర్డీఓ జనార్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊర్కొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ లేనందున రైతులు, పొలం పట్టదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్డీఓ స్పందించి వెంటనే ఊర్కొండ మండలానికి సర్వేయర్‌ను నియమించాలని ఈ సందర్భంగా కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సర్పంచ్ వెంట రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యంను పట్టివేత

**నారాయణ పేట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో కావలి వెంకటేష్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 27 బ్యాగులు (సుమారు 10 క్వింటాళ్లు) పిడిఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై రాముడు తెలిపారు. స్వాధీనం చేసిన పిడిఎస్ రైస్‌పై డిటి పంచనామా నిర్వహించిన అనంతరం నిందితుడైన కావలి వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



పిడిఎస్ రైస్‌ను పట్టుకున్న పోలీసులు

## బాధిత కుటుంబ సభ్యులకు కలెక్టర్ పరామర్శ

**- వేముల గ్రామానికి చెందిన దళిత యువతి మృతి ఘటనపై ఆరా**

**మహబూబ్‌నగర్, డిసెంబర్19,ప్రభాతవార్త:** మూసాపేట మండలం వేముల గ్రామంలో ఈ నెల 17న జరిగిన యువతి కుమారి కొమిరే ప్రవళిక (22) అత్యాచార ఘటన అ నంతరం మృతి చెందిన విషయం తెలుసుకు న్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బాధి త కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యువతి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పడం తో పాటు, ఈ ఘటనను అత్యంత హేయమైనదిగా పరిగణిస్తున్నామని తెలిపారు. అత్యాచారం వంటి నేరాలకు పాల్పడిన నిందితునిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని, త్వరితగతిన శిక్ష పడేలా ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం పూర్తిగా అండగా ఉంటుందని ఆమె తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,డి.ఎస్.పి.వెంకటేశ్వర్లు, ఆర్.డి. ఓ నవీన్ ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్

## వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

**కార్యకర్తలు అధైర్యపడొద్దు : మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబర్ 19,ప్రభాతావార్త:** వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్ రూరల్ మండలం బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఫతేపూర్ గ్రామ సర్పంచ్ అశోక్ యాదవ్‌ను, లాల్య నాయక్ తాండ కు చెందిన వార్డు మెంబర్ రాజును మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ శాలువ కప్పి సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, పట్టణ తీళీళీ పార్టీ అధ్యక్షులు శివ రాజు, మాజీ సర్పంచ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## పీయూ ఏబీవీపీ అధ్యక్షుడికి రవితేజ, కార్యదర్శిగా రవి కిషోర్

**- స్వాగతోత్సవ కార్యక్రమంలో నూతన యూనివర్సిటీ కమిటీ ప్రకటన**

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 19,ప్రభాతావార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో "స్వాగతోత్స వ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పాలమూరు యూనివర్సిటీకి నూతనంగా విచ్చేసిన విద్యార్థిని, విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏబీవీపీ పాలమూరు యూనివర్సిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. యూనివర్సిటీ అధ్యక్షులుగా రవితేజ, యూనివర్సిటీ కార్యదర్శిగా కావలి రవి కిషోర్, పిజి కోల్లెజ్ అధ్యక్షులుగా యువ కుమార్ పిజి కోల్లెజ్ కార్యదర్శిగా టి మమత , అకాడమిక్ బ్లాక్ అధ్యక్షులుగా అశోక్, అకాడమిక్ బ్లాక్ కార్యదర్శిగా దినేష్, బిటెక్ బ్లాక్ అధ్యక్షులుగా కార్తీక్ , బిటెక్ బ్లాక్ కార్యదర్శిగా భావన , ఫార్మసీ బ్లాక్ అధ్యక్షులుగా వంశీ ,ఫార్మసీ బ్లాక్ కార్యదర్శిగా శ్రీకాంత్ ను నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి పాలమూరు యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ ఈ. రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ముఖ్య వక్తగా ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ పాల్గొని విద్యార్థుల జీవితంలో విద్య, విలువలు, జాతీయ భావన ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలోపాలమూరు సంఘటన మంత్రి కాయం నరేంద్ర గారు,స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అర్జున్ గారుమరియు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీకెండ్ వండర్స్ పోస్టర్ ఆవిష్కరణ

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** జిల్లాలో దాగి ఉన్న పర్యాటక అందాలను ఫొటోలు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారికి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారీ నగదు బహుమతులు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుధీర్ రెడ్డితో కలిసి 100 వీకెండ్ వండర్స్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలు వారాంతాల్లో వెళ్లేందుకు కొత్త ప్రదేశాలను అన్వేషిస్తుంటారని, ఈ నేపథ్యంలోనే 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పేరుతో ఒక పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పెద్దగా తెలియని జలపాతాలు, పురాతన దేవాల యాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి 100 కొత్త గమ్యస్థానాలను గుర్తించి, వాటి వివరాలతో ఒక కాఫీ టేబుల్ బుక్ రూపొందించడమే ఈ పోటీ లక్ష్యమని పేర్కొన్నారు. నేచర్, వైల్డ్ లైఫ్, ఆర్ట్ అండ్ కల్చర్, హెరిటేజ్, వాటర్ బాడీస్, వంటకాలు, ఫామ్ స్టేస్, రిసార్ట్స్, స్పిరిచువల్, అడ్వెంచర్ వంటి 10 విభాగాల్లో ఎంట్రీలు పంపవచ్చని అన్నారు. ఎంచుకున్న ప్రదేశానికి సంబంధించి 3 మంచి ఫొటోలు, 60 సెకన్ల వీడియో, ఆ ప్రదేశానికి రవాణా, బస, బడ్జెట్ వివరాలతో కూడిన 100 పదాల సమాచారాన్ని పోస్టర్లో పేర్కొన్న గూగుల్ ఫామ్ లేదా సోషల్ మీడియా ఎకౌంట్లకు ట్యాగ్ చేయవచ్చని తెలిపారు. ఉత్తమ ఎంట్రీలకు ఫస్ట్ ప్రైజ్ రూ.50 వేలు, సెకండ్ ప్రైజ్ గారూ.30 వేలు, థర్డ్ ప్రైజ్ గారూ.20 వేలు అందిస్తామన్నారు. కన్సోలేషన్ బహుమతులుగా హరిత హోటల్స్‌లో ఉచిత బస కల్పిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 5లోపు ఎంట్రీలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**చెన్నకేశవులు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల, డిసెంబర్19,ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు భూరెడ్డి పల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవులు ఇటీవ లే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ యాన్ని గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారె డ్డికి సమాచారం తెలియజేశారు. ఈ సంద ర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగా ఢ సానుభూతి ప్రకటించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సూచన మేరకు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి అతని భార్య కు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పిట్టల మురళి, శ్రీనివాస్ యాదవ్, మల్లెబోయిన్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ మల్లేష్ ,చేన్న కేశవులు, గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి,రాజు,సంపత్, రమేష్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## దశాబ్దాల రాజకీయం

**ఆ కుటుంబానికే పట్టం కట్టిన గ్రామ ప్రజలు**

**మక్తల్ టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** మక్తల్ మండల పరిధిలో గల మంతన్ గోడు గ్రామమస్తులు నూతన సర్పంచ్ పదవీని రాజేందర్ గౌడ్ కు పట్టం కట్టారు. ఆ కుటుంబం ఐక్యంగా ఉంటూ గ్రామ సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ గా వనజమ్మ కుటుంబ సభ్యులకే పదవులు దక్కుతాయి. గ్రామస్తుల ఆదరణకు వారు గ్రామాన్ని అభివృద్ధి దశలో తీసుకొచ్చారు. నాటి సర్పంచ్ శకుంతలమ్మ నుంచి మనవడు ప్రస్తుతం రాజేందర్ గౌడ్ సర్పంచ్ గా గ్రామస్తులు గెలిపించుకున్నారు. ఈ కుటుంబం రాజకీయ ప్రాబల్యం కోసం పార్టీలు మారిన గ్రామ అభివృద్ధి ని మరవకపోవడంతో గ్రామస్తులు ఆ కుటుంబ వ్యక్తిని సర్పంచ్ గా ఎన్నుకున్నారు. నియోజకవర్గం లోని మక్తల్ మండలంలోని రాజకీయ ఆధిపత్యం కోసం మంతన్ గోడు గ్రామానికి ఫ్యాక్షనిస్టు చరిత్ర ఉంది. అధికారంలో ఎవ్వరూ ఉన్న గ్రామాభివృద్ధిలో ఇరు వర్గాలు చేతులు కలుపడం ప్రత్యేకత. 1990 శతకంలో రిటైర్డ్ తహశీల్దార్ భోజప్ప సతీమణి శకుంతలమ్మ రాజకీయంగా అరంగ్రేటం చేసి సర్పంచిగా నెగ్గారు. నాటి నుంచి ప్రారంభమై మూడు దఫాలుగా గ్రామ సర్పంచ్ గా పదవిని కట్టబెట్టారు. సొంత మరిది కోడలు సర్పంచ్ గా ఎంపీటీసీగా కొనసాగి కొత్తగా ఏర్పడిన నారాయణ పేట్ జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిలో ఐదేళ్ల కాలం కొనసాగిన చరిత్ర ఉంది. ప్రస్తుతం జరిగిన సర్పంచ్ ఎన్నికలో శకుంతలమ్మ మనవడు రాజేందర్ గౌడ్ ను సర్పంచిగా ఎన్నుకున్నారు. 40 ఏళ్ళు గా వీరి కుటుంబ సభ్యులు సర్పంచి నుండి జిల్లా పరిషత్ చైర్మన్ గా ఈ కుటుంబ సభ్యుల ఉండడంతో వీరి హయాంలోనే గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు,వీధి దీపాలు పంచాయతీలో ఉండాల్సి న అన్ని పక్క భవనాలను అభివృద్ధి పరిచారు. జిల్లాలోని మంతన్ గౌడ్ గ్రామానికి ఓ ప్రత్యేకత పేరు రావడానికి కారణమై తమ కుటుంబం చేసిన అభివృద్ధికి చిన్న వయసులోనే తనకు సర్పంచ్ పదవి కట్టబెట్టిన గ్రామస్తుల అందరికీ అందు బాటులో ఉండి సర్పంచ్ నుండి మంత్రిగా ఎదిగిన వాకిటి శ్రీహరి తనకు రాజకీయంగా ఆదర్శమని ఆయన సహకారం తో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని రాజేందర్ గౌడ్ తెలియజేశారు.

# అబద్ధాల పునాదులపై ఉన్న కాంగ్రెస్ కూలడం ఖాయం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవం**

**జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్**

**బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

**వనపర్తి రూరల్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అలివికాని,ఆచరణ సాధ్యం కాని 420హామీలు, 6గ్యారంటీలు ఇచ్చి అమలు చేయలేక ప్రజల తీవ్ర వ్యతిరేకతకు గురైనారని గట్టు యాదవ్ అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిశ్శబ్ద విప్లవం ద్వారా ప్రజలు బిఆర్ఎస్ పార్టీని, కెసిఆర్ ను ఆదరించారని ఇది తట్టుకోలేని ఎమ్మెల్యే అసహనంతో ప్రజాస్వామ్యానికి చేటు తెచ్చేవిధంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 59మంది సర్పంచులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**రేవంత్ రెడ్డిది ప్రచార ఆర్భాటం..**

**జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

రేవంత్ రెడ్డి ప్రజాధనాన్ని తన ప్రచార ఆర్భాటం కోసం రూ. 3000కోట్లు దుబారా చేశారని అందాల పోటీలకు, తెలంగాణ సమ్మిట్, డిల్లీ పర్యటనలకు,ప్రజా పరిపాలన ప్రచారం కోసం,ఫుట్ బాల్ స్టేడియం కోసం ప్రజాధనాన్ని వాడి సంక్షేమ పథకాలు బంద్ పెట్టినారని వాకిటి శ్రీధర్ ఆరోపించారు. కెసిఆర్ హయాంలో 135 గ్రామ పంచాయతీలకు గాను 122పంచాయితీలు గెలిపించి ప్రజల హృదయాలలో నిలిచారని రేవంత్ పాలనలో వైఫల్యం చెందినందుకే 50శాతం పంచాయతీలకు పరిమితమైనారని ఎద్దేవా చేశారు. ప్రజలు కెసిఆర్ సుస్థిర పాలన నిరంజన్ రెడ్డి ప్రజాపాలన కోరుకుంటున్నారని వాకిటిశ్రీధర్ అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్

**క్యాంపు కార్యాలయం ఎం.ఎల్.ఏ అబ్బ సొత్తు కాదు**

బిఆర్ఎస్ సర్పంచులు నీ గేటు కూడా తొక్కరు రాబోయే బిఆర్ఎస్ ప్రభంజనములో ఎమ్మెల్యే కొట్టుకుపోవడం ఖాయం కృష్ణా నాయక్ మాజీ ఎంపిపి ఎమ్మెల్యే ఎన్ని అరాచకాలు, ప్రలోభాలు,దౌర్జన్యాలకు పాల్పడినా ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి 59 మంది సర్పంచులను గెలిపించినారని కృష్ణా నాయక్ విమర్శించారు. నిరంజన్ రెడ్డి కట్టించిన క్యాంపు కార్యాలయంలో ఉంటూ బిఆర్ఎస్ సర్పంచులను గేటు తొక్కనీయను అంటావా నిన్ను గేటు బయటికి మెడ పట్టి గెంటే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. ఘనపురం మండలం సమావేశంకు తులం బంగారం,మహిళలకు రూ.2500,వృద్ధులకు రూ.4000,వికలాంగులకు రూ. 6000,నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, గ్యాస్ సబ్సిడీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా ఇచ్చిన తర్వాతనే రావాలని డిమాండ్ చేశారు.రెండేండ్లలో ఎమ్మెల్యే పీకింది ఏమీలేదని ఇంకా మూడేండ్లలో ఏమి పీకలేరని ప్రజలు గుర్తించారని ఇప్పటికైనా ప్రతిపక్షాలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పెబ్బేర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రీస్వామి,నాయకులు రాళ్ళ కృష్ణయ్య, ఎద్దుల సాయి కుమార్, స్టార్ రహీమ్, జోహెబ్, హుస్సేన్, చిట్యాల రాము, రామకృష్ణ, నందిమల్ల అశోక్,జిల్లా మీడియా కన్వీనర్ పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం

**-ఎమ్మెల్యే నిధులతో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో పనులు ప్రారంభం..**

**-ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి ముస్లింల కృతజ్ఞతలు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం లోని వక్ఫ్ కాంప్లెక్స్ ముందు నుంచి డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకా రం చుట్టారు. సుమారు 16 ఎకరాలలో విస్తరించి ఉన్న ముస్లింల ఖబ్రస్తాన్‌లో వర్షపు నీరు నిలుస్తూ ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియలు చేపట్టడానికి తీవ్ర ఆటంకంగా మారింది. గతంలో నీరు బయటకు వెళ్లే దారులు ఉన్న క్రమక్రమం గా ఆ దారులు తొలగించి దుకాణాలుగా ఏర్పాటు చేయడం వల్ల ఖబ్రస్తాన్‌లోని సమాధుల మధ్య నీరు నిలుస్తుంది. దీనికి తోడు వక్ఫ్ కాంప్లెక్స్ దుకాణాలలోని హోటల్లు, ఇతర వ్యాపారులు, డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో దుకాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుభాష్ చికెన్ సెంటర్ పక్కన నీరు వెళ్లడానికి డ్రైనేజీ ఉన్న నిర్వహణ లోపం కారణంగా అది మూసుకుపోయి నీరు వెళ్లే దారి లేక సమాధుల మధ్య నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముస్లిం సంఘాల బాధ్యులు, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ నిజాం, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుల్ల దామోదర్‌రెడ్డిల దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి శ్రీపురం రోడ్డు చౌరస్తా నుంచి సుభాష్ చికెన్ సెంటర్ వరకు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇట్టి పనులను మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం పనులు ప్రారంభించారు. డ్రైనేజీ నిర్మాణం కోసం సహకరించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి తో పాటు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా సహకరించిన కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ మహమ్మద్ నిజాం, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు నాసర్ మోహియోద్దీన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు నాగర్ కర్నూల్ పట్టణ ముస్లింలు, వక్ఫ్ కాంప్లెక్స్ టెనెంట్స్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ అధికారులు

# పైసా పైలంతో మోసాలకు బ్రేక్

**ఆటో డ్రైవర్లలో సైబర్ చైతన్యం**

**సైబర్ ఎస్సై రవిప్రకాష్**

**మూడవ వారం ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో సైబర్ భద్రతకు పెద్ద అడుగు**

**టిజిసిఎస్‌బి సైబర్ పోస్టర్లతో ప్రజలకు ప్రత్యక్ష అవగాహన**

**జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ఆదేశాలతో అవగాహన కార్యక్రమం**

**వనపర్తి,డిసెంబరు 19 ప్రభాతవార్త:** ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమాల్లో భాగంగా మూడవ వారం"పైసా పైలం" అనే ప్రత్యే క సైబర్ అవగాహన కార్యక్రమాన్ని వనప ర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ఆదేశాల మేర కు సెక్యూరిటీ ఎస్సై, రవి ప్రకాష్ ఆధ్వ ర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ ఎస్సై మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పెరు గుతున్న ఆన్‌లైన్ మోసాలు, యూపీఐ ఫ్రాడ్‌లు, ఓటీపీ మోసాలు, నకిలీ కాల్స్, లింకుల ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులపై స్పందించవద్దని, ఎవరికి అయినా ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు తెలియజేయడం వల్ల ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్పష్టంగా వివరించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. ప్రతి రూపాయి కష్టం సంపాదన. తెలియని కాల్స్, లింకులు, ఓటీపీలు మీ ఆర్థిక భద్రతకు ప్రమాదకరం. పోలీసుశాఖ ప్రజల రక్షణకు ఎప్పుడూ ముందుంటుంది.పైసా పైలం ద్వారా ప్రతి ఒక్కరిలో సైబర్ చైతన్యం పెరగాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటో డ్రైవర్లు మాత్రమే కాకుండా, వారి ద్వారా ప్రయాణించే ప్రజల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెరుగుతుందని ఎస్సై అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా టిజిసిఎస్‌బి (తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో) నుంచి అందిన సైబర్ అవగాహన పోస్టర్లను విడుదల చేసి ఆటోలపై అతికించి, ప్రయాణికులు, సామాన్య ప్రజల్లో సైతం సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పోలీస్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు ఉన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

# క్యాన్సర్ నివారణ మార్గాలు తెలుసుకోవాలి

**- డా.బీఆర్ఆర్ఆర్ కళాశాలలో బసవతారకం దవాఖాన ఆధ్వర్యంలో అవగాహన**

**మహబూబ్‌నగర్,డిసెంబర్19,ప్రభాతవార్త :**జడ్చర్లలోని డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ అకాడమీ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్‌వారు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారి సంయుక్త సారథ్యంలో క్యాన్సర్ నివారణ ప్రతిజ్ఞను శుక్రవారం నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న జీవన శైలి లకు అనుగుణంగా ఆహారపు అలవాట్లు,దైనందిన జీవన విధానంలో మార్పుల కారణంగా వివిధ అనారోగ్యం సమస్యలు నిత్యజీవితంలో ఎదురవుతున్నాయి. వాటిలో వివిధరకాలైన క్యాన్సర్ సర్వసాధారణంగా ఎదురవుతున్న ఒక సమస్య.క్యాన్సర్ నుండి ప్రభావితం కాబడి చికిత్స కోసం ప్రయత్నించడం కన్నా క్యాన్సర్ రాకుండా నివారణ మార్గాలను తెలుసుకోవడం విద్యార్థి దశలో కీలకమైన అంశముగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి సుకన్య గారు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు యుక్త వయస్సు కలిగి ఉండడం వల్ల చెడు అలవాట్లకు, మద్యం సేవించడం, పాన్ మరియు గుట్కా సిగరెట్ వంటి సమాజంలో ఉన్న ఇతర ప్రలోభాలకు త్వరగా ఆకర్షితులు కాబడి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. నేటి కాలంలో ఆహారపు అలవాట్లు కూడా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆవిడ తెలియజేశారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండడం కోసం మంచి ఆహారపు అలవాట్లు మరియు శారీరక వ్యాయామము నిత్యము చేయడము, మానసిక ఒత్తిడికి లోనయ్యే అంశాలకు దూరంగా ఉండడం, నిరంతర ఆరోగ్య చెకప్ చేయించుకోవడం, ఏదైనా చిన్న గడ్డ లాంటి భాగము మనకు స్పర్శను తెలియకుండా ఉన్నట్లయితే వెంటనే సమీప వైద్య సహాయమును పొందగలరని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. క్యాన్సర్ గురించి అవగాహనను కలిగి ఉండడమే క్యాన్సర్ నివారణకు అత్యుత్తమ మార్గమని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో భాగం గా ఇష్రత్ సుల్తానా, జంతు శాస్త్ర అధ్యాపకురాలు ముఖ్య వక్తగా వ్యవహరిస్తూ క్యాన్సర్ అంటే ఏమిటి క్యాన్సర్ కణాల యొక్క ముఖ్య లక్షణాలు,క్యాన్సర్‌లో ఉండే వివిధరకాలు,వాటి పరిణామ క్రమము,నివారణ మార్గాలు, పొందవలసిన సహాయక చర్యలపై విద్యార్థులకు సుదీర్ఘంగా తెలియజేయడం జరిగింది. కార్యక్రమానికి టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ బి నాగలక్ష్మి సారథ్యం వహించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నర్మదా, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ మాధురి, రసాయన శాస్త్ర హెచ్ ఓ డి రుఖియా భాను, భౌతిక శాస్త్ర హెచ్ఓడి సురైయా జబీన్, హిందీ విభాగ అధిపతి డాక్టర్ నరసింహారావు, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ వెంకటయ్య, లత, రజిని, వెంకటేశ్వర్లు మరియు టీఎస్ కేసి మెంటర్ వీర ప్రతాప్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని క్యాన్సర్ నివారణ ప్రతిజ్ఞను తీసుకున్నారు. క్యాన్సర్ విముక్త భవిష్యత్తును నిర్మించడమే యువత యొక్క లక్ష్యంగా ఉండాలని సభ్యులు తెలియజేశారు.



అవగాహన కల్పిస్తున్న దవాఖాన బృందం

## గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా

**జడ్చర్ల,డిసెంబర్ 19 ప్రభాతవార్త:** కోడ్గల్ గ్రామ నూతన సర్పంచ్‌గా తనపై నమ్మకం ఉంచి,సర్పంచ్ గా నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ఒక్కరోజులో వచ్చినది కాదని, ఇది తన ఒక్కడి విజయం కాదన్నారు. ఇది కోడ్గల్ గ్రామ ప్రజల ఆశల విజయం,కార్యకర్తల కష్టానికి వచ్చిన గౌరవం అనీ పేర్కొన్నారు. గ్రామ భవిష్యత్తుపై మీరు పెట్టిన నమ్మకానికి తగ్గట్టు పనిచేస్తానని కోడుగల్ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సాయిరెడ్డి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మా గ్రామానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ,నాకు మార్గనిర్దేశం చేసి,ప్రోత్సాహం అందించి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రతి పార్టీ నాయకులను కలుపుకొని గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని అభివృద్ధి పైనే తన ధ్యాస ఉంటుందని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ కార్యకర్తల**

## జోలికొస్తే ఊరుకోను

మొదటి పేజీ తరువాయి భాగం..

పార్టీ వారు రౌడీయిజం చేస్తున్నారని కేటీఆర్ అంటున్నారని, అయితే నస్రుల్లాబాద్ తాండలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపొందితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు గొడ్డలితో దాడి చేసారని రౌడీయిజం ఎవరు చేస్తున్నారో కేటీఆర్ ఇప్పుడు చెప్పాలని కోరారు. ఇదేనా మీ బీఆర్ఎస్ పార్టీ సంస్కృతి అని నిలదీసారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మహబూబ్ నగర్, జడ్చర్ల ప్రాంతాల్లో ఎంత అరాచకాలు చేసారో అందరికీ తెలుసునని అనిరుధ్ రెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు రౌడీయిజం, భూకబ్జాలు చేసి కోట్లాది రుపాయిలు సంపాదించుకొని ఆ సొమ్ముతో పంచాయితీ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించారని, అయితే ప్రజలు వారికి ఓట్లు వేయకుండా బుద్ధి చెప్పారని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం ఇస్తున్న ఏడవ గ్యారెంటీ స్వేచ్ఛ అని చెప్పారని, దానికి తాము కూడా కట్టుబడి ఉంటామని చెప్పారు. గొల్లపల్లిలో కూడా బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య గొడవ జరిగిందని ఈ విషయం తన దృష్టికి వచ్చిన తర్వాత తాను గొల్లపల్లిలో గెలిచిన బీజేపీ సర్పంచ్ అభ్యర్థి తోనూ మాట్లాడి వారికి ఏ ఇబ్బంది జరగనివ్వకుండా చూస్తానని హామీ ఇచ్చానని వెల్లడించారు. శాంతి భద్రతలు ప్రధానమని స్పష్టం చేసానని తెలిపారు. ప్రజాస్వామంపై నమ్మకం ఉంచి గెలిచిన వారిని గౌరవించాలని, ఓడిన బాధలో ఉన్నవారికి సపోర్టుగా ఉండాలని అన్ని రాజకీయ పక్షాలకు అనిరుధ్ రెడ్డి విజప్తి చేసారు. గొడవలకు ఎవరు దిగినా సహించేది లేదని పేర్కొన్నారు. జరుగుతున్న గొడవలకు కేటీఆర్ కారణమని తాను చెప్పడం లేదని బీఆర్ఎస్ పార్టీ పెంచి పోషించిన రౌడీలు దీనికి కారణమని ఒక ప్రశ్నకు బదులుగా అనిరుధ్ స్పష్టీకరించారు.

## మా పార్టీ పెద్దల వల్లే కాంగ్రెస్‌కి నష్టం

మొదటి పేజీ తరువాయి భాగం..

సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పరోక్షంగా బిఆర్ఎస్ గెలుపుకు కృషి చేస్తూ పార్టీకి ద్రోహం చేసేవాళ్ళ తీరును కాంగ్రెస్ పార్టీ మేధావులు, ప్రజలు గమనిస్తున్నారని, సీనియర్ నాయకులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, సభ్యులు శంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సేవలు వారసత్వంగా**

## కొనసాగింపు

**మందిపల్లి నూతన సర్పంచ్ సురేందర్ రెడ్డి**



నూతన సర్పంచ్ సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**ధన్వాడ, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం లోని మందిపల్లి గ్రామంలో జరిగిన రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతన సర్పంచ్‌గా సురేందర్ రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా అప్పంపల్లి గ్రామానికి చెందిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు పూలమాలలు, శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానం అనంతరం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, విద్యా-ఆరోగ్య సేవల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో పారదర్శక పాలన అందిస్తూ, ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ సేవల కుటుంబ వారసత్వం సురేందర్ రెడ్డికి గ్రామ పాలన కొత్తది కాదు. ఆయన తండ్రి 1988 వరకు మందిపల్లి గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతూ గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారు. అదే సేవా భావనను కొనసాగిస్తూ, 1994 నుంచే సురేందర్ రెడ్డి గ్రామ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తున్నారు. గ్రామస్థుల మధ్య నమ్మకం, నాయకత్వంతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఆంజనేయులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.